సాక్షి వరంగల్

సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



సారథి.. వాహనదారులకు వారధి
ప్రభుత్వం రవాణా శాఖలో తీసుకొచ్చిన సారథి పోర్టల్ విధానాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చి సేవలందిస్తోంది. - 8లో▸



విద్యా రంగంలో కొత్త అధ్యాయం..
సమ్మక్క, సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు అందుతాయని మంత్రి సీతక్క అన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0^0/25.0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

న్యూశాయంపేట: కలెక్టరేట్‌లో సోమవారం (నేడు) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్దుల బతుకమ్మ పండుగ దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలక్టరేట్‌కు రావొద్దని కోరారు.

గ్రేటర్ గ్రీవెన్స్ కూడా..
వరంగల్ అర్బన్: సద్దుల బతుకమ్మ, దసరా వేడుకల ఏర్పాట్లలో అధికారులు, ఉద్యోగులు నిమగ్నమైనందున సోమవారం గ్రీవెన్స్ సెల్‌ను రద్దు చేస్తున్నట్లు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. నగర ప్రజలు ఫిర్యాదులు అందించడానికి గ్రీవెన్స్‌సెల్‌కు రావొద్దని విజ్ఞప్తి కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడుదాం



నర్సంపేట రూరల్ : కుల వ్యవస్థ నిర్మూలనకు సంఘటితంగా పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, కుల నిర్మూలనే ధ్యేయంగా మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధన్ సమాజ్ 152వ ఆవిర్భావ వారోత్సవాలను పుస్కరించుకొని సెప్టెంబర్ 24 నుంచి 30 వరకు కుల నిర్మూలన ఆచరణాత్మక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు దార లింగయ్య, అడ్డూరి రాజు, కత్తుల కొమురయ్య, సింగనబోయిన కట్టయ్య, రవి, సారయ్య, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

గౌరవ డాక్టరేట్ ప్రదానం



నర్సంపేట: సామాజిక సేవా రంగంలో నర్సంపేట ఆర్టీసీ డిపో కండక్టర్ గొలనకొండ వేణుకు హైదరాబాద్‌లో తెలుగు సంస్కృతి సాహితి సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌తో ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటుడు బాబుమోహన్ చేతుల మీదుగా వేణు పురస్కారాన్ని అందుకున్నారు. నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన వేణు 17 సంవత్సరాలుగా ఆర్టీసీ కండక్టర్ ఉద్యోగం చేస్తూనే కొన్నేళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాడు. గ్రామ ఉద్యోగుల ఐక్య వేదిక స్థాపించి వ్యవస్థాపక అధ్యక్షుడిగా వినూత్న కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. వేణు గౌరవ డాక్టరేట్ అందుకోవడంపై నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి అభినందించారు.

తూకంలో తేడాలొస్తే కఠిన చర్యలు



న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని మటన్, చికెన్, చేపలు విక్రయించే వ్యాపారులు తక్కువ తూకంతో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి మనోహర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన నేతృత్వంలో నగరంలోని పలు మటన్, చికెన్, చేపలు విక్రయించే షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఉపయోగించే ఎలక్ట్రానిక్, సంప్రదాయ కాంటా యంత్రాలు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా.. లేదా? అనే విషయాల్ని ధ్రువీకరించి, స్టాంపింగ్ ప్రక్రియలను పరిశీలించారు. ఈతనిఖీల సందర్భంగా పలు దుకాణాల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించబడిందని, ముఖ్యంగా తక్కువ తూనికలతో విక్రయాలు జరుపుతున్న విషయం తనిఖీల్లో బయటపడ్డాయన్నారు. అక్రమాలకు పాల్పడే వారిని గుర్తించి 9 కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు చేసేటప్పుడు తూకం సరిగ్గా ఉందా లేదా? అనే విషయాలను వినియోగదారులే పరిశీలించుకోవాలని సూచించారు. వినియోగదారుల హక్కులను పరిరక్షించడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని, ఇలాంటి తనిఖీలు తరచూ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. వ్యాపారులు చట్టబద్ధమైన తూనికలు, కొలతల పరికరాలు వాడాలని, లేనిచో కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

‘సద్దుల’కు సిద్ధం

కొన్నిచోట్ల నేడు.. మరికొన్ని చోట్ల రేపు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు, స్థానిక నాయకులు
- పల్లెల్లో చాటింపు, మైక్ సెట్‌లతో ప్రచారం



సంగెంలో బతుకమ్మ ఆట స్థలాన్ని చదును చేస్తున్న సిబ్బంది

సాక్షి, వరంగల్: పూల పండుగలో చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మ వేడుకల నిర్వహణకు గ్రామాలు సిద్ధమవుతున్నాయి. సద్దుల బతుకమ్మపై సందిగ్ధత నెలకొన్నా.. తొమ్మిదో రోజైన సోమవారం నిర్వహించేందుకే జిల్లాలోని చాలా గ్రామాలు, పట్టణాల్లో సిద్ధమవుతున్నాయి. మంగళవారం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు, కొందరు వేద పండితులు కూడా మంగళవారమేనని చెబుతున్నా.. సోమవారం నిర్వహించేందుకే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ఈ మేరకు ఆయా పల్లెల్లో డప్పు చప్పుళ్లతో చాటింపు చేయడం కనిపించింది. ఇంకొన్ని గ్రామాల్లో మైక్‌ల సోమవారమే బతుకమ్మ ఆడాలంటూ అనౌన్స్ చేస్తున్నారు. వరంగల్ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం, మరికొన్ని ప్రాంతాల్లో మంగళవారం నిర్వహిస్తుండడంతో సద్దుల బతుకమ్మ వేడుకలతో గ్రామాల్లో రెండురోజులు సందడి నెలకొననుంది. వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి, సంగెం, గీసుగొండ, నర్సంపేట, చెన్నారావుపేట, దుగ్గొండి, నెక్కొండ, ఖానాపూపురం మండలాల్లో సోమవారం సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా నిర్వహించేందుకు పంచాయతీ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్క నల్లబెల్లి మండలంలోనే మంగళవారం పెద్ద బతుకమ్మ ఉంటుందని స్థానిక పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు.

పూల సందడి..



ఓ గ్రామంలో డప్పు చాటింపు చేస్తున్న వ్యక్తి

బతుకమ్మ పండుగకు తంగేడు, గునుగు, బంతిపూలు, తామర, చామంతి, సీతజడ వంటి అనేక రకాల పూలు వాడతారు. ఈ పూలతో బతుకమ్మను పేర్చి అందంగా తీర్చిదిద్దుతారు. ఇప్పుడూ పెద్ద బతుకమ్మకు అవసరమైన ఈ పూలను జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వరంగల్ నగరానికి శనివారం తీసుకొచ్చి విక్రయించడం కనిపించింది. మహిళలు భారీ సంఖ్యలో ఈ పూలను కొనుగోలు చేసి తీసుకెళ్లారు. నగరంలో కూడా కొన్నిచోట్ల సోమవారం పెద్ద బతుకమ్మ నిర్వహించాలని కాలనీవాసులు నిర్ణయించినట్లు తెలిసింది.

కార్యదర్శులపై ఉత్సవాల భారం
పల్లెల్లో బతుకమ్మ ఉత్సవాల నిర్వహణకు అయ్యే ఖర్చు గ్రామ కార్యదర్శులపై పడుతోంది. ఏడాది కాలంగా పంచాయతీలో ఉన్న నిధులు వాడుకోవడానికి వీలు లేకుండా ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఏ ఖర్చయినా కార్యదర్శి బయట అప్పుగా తీసుకొచ్చి ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంత చిన్న గ్రామ పంచాయతీలోనైనా బతుకమ్మ ఏర్పాట్లకు రూ.40 వేలకు పైగా అవసరం అవుతున్నట్లు తెలుస్తోంది. మూడు వేల జనాభా ఉన్న పంచాయతీల్లో దాదాపు రూ.లక్ష వరకు ఖర్చవుతోంది. ఈ నిధులు ఎలా సమకూర్చాలో తెలియక ఆయా గ్రామాల కార్యదర్శులు అయోమయంలో పడ్డారు. బతుకమ్మ నిమజ్జన ప్రాంతంలో భూమిచదును చేయడం, ఆడే ప్రదేశంతోపాటు నిమజ్జనం వద్ద లైటింగ్, నీటిలోకి దిగడానికి మెట్లు తదితర ఏర్పాట్లకు ఖర్చు చేయాల్సి ఉన్నా.. నిధులు లేకపోవడంతో కార్యదర్శులు సతమతమవుతున్నారు.

పట్నం బతుకమ్మలకు పల్లెపూలు

- పూలతో ప్రయాణం.. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆచారం
- ఏటేటా ఉపాధి పొందుతున్న పల్లె ప్రజలు



పూలను పట్టణానికి తరలిస్తున్న ఆటో

దుగ్గొండి: సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పల్లె పువ్వులన్నీ పట్నం బాటపట్టాయి. పల్లె నుంచి తరలివచ్చిన తీరొక్క పూలతో పట్టణ రోడ్లన్నీ నిండిపోయాయి. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గ్రామీణ ప్రాంతాల్లోని పలువురు వారం రోజులపాటు పల్లెల్లోని పంట పొలాలు, అటవీ ప్రాంతాల్లో లభించే గునుగు, తంగేడు, బంతి, చామంతి, సీత జడపూలు, టేకు, గుమ్మడి ఇలా అనేక రకాల పూలను సేకరిస్తారు. గుమ్మడి ఆకులను సైతం సేకరించి, పువ్వులను కట్టలుగా కట్టి రంగులద్ది అరబెట్టి బతుకమ్మకు ఒకరోజు ముందు వరంగల్, హనుమకొండ పట్టణాలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. పల్లె వాసులు తెచ్చిన పూలతో పట్టణం నిండిపోతుంది.

20 ఏళ్లుగా పూలు అమ్ముతున్నా..

మేము నలుగురం అక్కాచెల్లెలం.. ప్రతియేటా బతుకమ్మ పండుగకు వారం రోజుల ముందు



సీతజడ పూలు సేకరిస్తున్న రైతులు



నగరంలో పూలను విక్రయిస్తున్న మహిళ

నుంచి రకరకాల పూలను సేకరిస్తాం. వ్యవసాయ బావుల వద్ద, బీడు భూముల్లో గునుగు, తంగేడు, సీతజడతోపాటు టేకు పువ్వు తెచ్చి కట్టలుగా కట్టి రంగులు అద్దుతాం. వరంగల్, హనుమకొండకు తీసుకెళ్లి అమ్ముతుంటాం. 20 ఏళ్లుగా ఇదే పని కొనసాగిస్తున్నాం. కొన్నిసార్లు గిట్టుబాటు అవుతుంది. మరికొన్నిసార్లు కాదు. అయినా బాధపడేది లేదు. మేము ఇచ్చిన పూలతో బతుకమ్మ పండుగ బాగా జరిగిందని సంతోష పడతాం.

- సావిత్రి, నాచినపల్లి

ఎస్టీలు లేకున్నా సర్పంచ్ స్థానం రిజర్వ్

- వంజరపల్లిలో ఎస్టీ జనాభా జీరో
- 2019లో ఎస్టీలు లేక రెండు వార్డులు ఖాళీ



వంజరపల్లి గ్రామపంచాయతీ

సంగెం: స్థానిక సంస్థల రిజర్వేషన్ల ప్రకటన సంగెం మండలంలో చర్చనీయాంశమైంది. జనాభా ప్రాతిపదికన కేటాయించిన రిజర్వేషన్లల్లో ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకపోవడం చర్చకు దారి తీసింది. మండలంలోని ఆశాలపల్లిలో ఎస్సీ జనాభా లేకపోగా 2011లో జనాభా లెక్కల్లో జరిగిన తప్పిదంతో ప్రస్తుతం ఎస్సీ మహిళకు సర్పంచ్ రిజర్వేషన్ కేటాయించబడిందనే విషయం తెలిసిందే.. ఇలాంటిదే మరో అంశంపై తెరపైకి వచ్చింది. మండలంలోని వంజరపల్లి సర్పంచ్ స్థానం ఎస్టీ జనరల్‌కు కేటాయింబడింది. కానీ, ఈ గ్రామంలో ఎస్టీ ఓటర్లు లేకపోవడం గమనార్హం. వంజరపల్లి పంచాయతీ పరిధిలో గతంలో రేఖియానాయక్ తండా ఉండేది. గత 2018లో తండాలు, శివారు గ్రామాలను నూతన పంచాయతీలుగా చేసిన సమయంలో వంజరపల్లి పరిధిలోని రేఖియానాయక్ తండాను పోచమ్మతండా పంచాయతీలో విలీనం చేశారు. అప్పట్లో రెండు వార్డులు ఎస్టీలకు కేటాయించడంతో ఎస్టీలు లేక ఆ వార్డులు ఖాళీగానే ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కేటాయించడంతో ఇప్పుడు వంజరపల్లి ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ అయింది. వంజరపల్లిలో 520 జనాభా 374 ఓటర్లుండగా ఒకరు కూడా ఎస్టీ లేకపోవడంతో సర్పంచ్ పదవి ఖాళీగా ఉండనుందా.. మార్చుతారా.. అనే చర్చ మొదలైంది.

దసరా ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- ఏసీపీ రవీందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి

నల్లబెల్లి: దసరా ఉత్సవాలు ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ సాయిరమణ, ఎస్సై గోవర్ధన్‌తో కలిసి రాజకీయ పార్టీల నాయకులతో ఏసీపీ ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గతఏడాది దసరా ఉత్సవాల్లో చోటు చేసుకున్న ఉద్రిక్తలను ప్రస్తావిస్తూ అలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామాభివృద్ధి కమిటీ, పోలీసులు సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు చిట్యాల తిరుపతి రెడ్డి, ఆంగోత్ పూల్‌సింగ్, గుమ్మడి వేణు, బత్తిని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వెంకట చంద్రప్రసన్న



సదస్సులో మాట్లాడుతున్న వెంకట చంద్రప్రసన్న

సంగెం: రైతులు చట్టాలపై అవగాహన పెంచుకుని వాటిని వినియోగించుకోవడం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వరంగల్ బోయిడివల్లి వెంకట చంద్ర ప్రసన్న అన్నారు. పర్వతగిరి సీఐ రాజగోపాల్ అధ్యక్షతన సంగెం, తీగరాజుపల్లి రైతు వేదికల్లో ఆదివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో 124 రైతు చట్టాలున్నాయని అన్నారు. వీటిపై రైతులకు అవగాహన లేకపోవడంతో భూ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అభిప్రాయపడ్డారు. రైతులు తమ హక్కులను తెలుసుకోకపోవడం వల్ల భూ సమస్యలు పరిష్కరించుకోలేకపోతున్నారని అన్నారు. తమ భూములను తామే సాగు చేసుకుంటున్నామని అవి తమవేని అనుకుంటున్నారన్నారు. కానీ కొందరు వారికి తెలియకుండా తమ పేర్లపై పట్టాలు చేసుకుంటుండడంతో అసలు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ పేరున పట్టాలు లేకపోవడం వల్ల ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందలేక అసలైన రైతులు నష్టపోతున్నారని తెలిపారు. రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలతో సంబంధిత అధికారులకు సర్వే కోసం దరఖాస్తు చేసుకుంటే విచారణ చేసి అసలు రైతుల పేరున నమోదు చేస్తారన్నారు. రైతులు తమ పేర ఉన్న భూములు ఇతరుల పేరున ఎలా మారాయో సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. సామాన్యులు, రైతులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. భూ సమస్యలు నోట్ చేసుకుని సంబంధిత నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్‌ను సమస్యలు పరిష్కారించాలని ఆదేశించారు. ఆ సమస్యల పరిష్కారం గురించి తమకు తెలియజేయాలన్నా పర్వతగిరి సీఐ రాజగోపాల్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎస్సై లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

బొగతలో సందడి



వాజేడు: మండల పరిధిలోని బొగత జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ప్రకృతి ఒడిలో సహజ సిద్ధంగా వెలిసిన బొగతను చూసేందుకు వచ్చిన పర్యాటకులు జాలువారుతున్న జలపాతాన్ని చూసి ఫిదా అయ్యారు. కొందరు పర్యాటకులు సమీప కొలనులో స్నానాలను చేయగా మరి కొందరు బొగత వద్ద ఫొటోలు దిగుతూ సందడిగా గడిపారు.

యథేచ్ఛగా కలప దందా

- మామూళ్ల మత్తులో అధికారులు ?
- పట్టించుకోని అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు
- అనుమతులు లేకుండానే అక్రమంగా తరలింపు





ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న కలప, వరంగల్ నగర శివారులో డంపు చేసిన కలప

న్యూశాయంపేట: జిల్లాలో అక్రమ కలప దందా వ్యవహారం యథేచ్ఛగా సాగుతోంది. జిల్లాలోని వివిధ మండలాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి రైతుల పొలాలు, గట్లపై, బీడు, ప్రభుత్వ భూముల్లో ఏపుగా పెరిగిన విలువైన చెట్లను నరికి పట్టణ ప్రాంతాలకు తరలిస్తూ అధికంగా కలప వ్యాపారులు లాభాలు దండుకుంటున్నారు. వాల్టా చట్టం ప్రకారం చెట్టు నరకాలంటే అటవీ, రెవెన్యూ, సంబంధిత గ్రామపంచాయితీ నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. కలప వ్యాపారులు ఇవేమి పట్టించుకోకుండా అటవీశాఖ, రెవెన్యూ అధికారులకు మామూళ్లు ముట్టచెబుతూ వారి అండదండలతో యథేచ్ఛగా చెట్లు నరుకుతూ పట్టణాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కలప రవాణా అరికట్టి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అధికారులు తమకేమి పట్టింపులేకుండా వ్యవరిస్తున్నారని ప్రజలు, పర్యావరణ పరిరక్షకులు ఆరోపిస్తున్నారు.

వాల్టా చట్టానికి తూట్లు!
పర్యావరణ పరిరక్షణ, చెట్ల నరికివేతను అరికట్టడానికి, అటవీ ప్రాంతాలను పెంచడానికి, అడవిని ప్రోత్సహించడానికి వాల్టా చట్టం ఉన్నా అది అక్రమార్కులకు చుట్టంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. మామూళ్ల మత్తులో అధికారులు ఉండడంతో చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయలేకపోతున్నారనే ఆరోపణలు సైతం లేకపోలేదు. పంటలు పండించడానికి, పశుగ్రాసం పెంచడానికి అటవీ భూములను వ్యవసాయ భూములుగా అక్రమార్కులు మారుస్తున్నారు. అటవీ సంపద లేకపోవడంతో వాయుకాలుష్యం పెరుగుతుంది. గృహ నిర్మాణాల కోసం పెరుగుతున్న జనాభాకు గృహావసరమైన కలపకోసం చెట్లను నరికేస్తున్నారు. చెట్ల నరికివేతను ఆపడానికి ప్రతీఒక్కరు కృషిచేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. చెట్లను నరికివేయడంతో పర్యావరణం, మానవ జీవితాలపై తీవ్ర ప్రభావాలు పడతాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెట్ల నరికివేతతో నష్టాలు
వృక్షాలు కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. దీంతో పర్యావరణ సమతుల్యత ఉంటుంది. లేదంటే జంతువులు, పక్షుల ఆవాసాలు నాశనం అవడంతోపాటు మానవ జీవనం అస్తవ్యస్తం అవుతుంది. ఇప్పటికే అనేక జీవరాశులు కనుమరుగయ్యాయని, వాతావరణాన్ని సంరక్షించే చెట్లను నరికితే మరింత ముప్పు తప్పదని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. చెట్ల వేర్లు నేలను పట్టి ఉంచుతాయి. వాటిని నరికివేయడంతో వర్షపు నీరు, గాలి వల్ల నేల కోతకు గురై భూసారం తగ్గిపోయే ప్రమాదం ఉంది. చెట్ల నరివేతతో వర్షాలు కూడా తగ్గుతాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని చెబుతున్నారు. కానీ, ఇవేవీ పట్టించుకోని అక్రమార్కులు మాత్రం తమ వ్యాపారమే ముఖ్యం అన్నట్లుగా చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు.

బాధితులకు భరోసా కల్పించాలి

- సీపీ సన్‌ప్రీత్ సింగ్



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సైలు

వరంగల్ క్రైం: పదోన్నతులతో బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైలుగా పదోన్నతి పొందిన ఎం.సాంబరెడ్డి, పి.జైపాల్, పి.లక్ష్మారెడ్డి, డి.వెంకటేశ్వర్లు, ఎం.సాంబయ్య, కె.వెంకన్న, డి.సమ్మిరెడ్డి, ఎం.లక్ష్మీనారాయణ, పి.శ్రీనివాస్ రాజు, ఎస్.సదయ్య ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్రాలను అలంకరించి అభినందనలు తెలిపారు. అనంతరం సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులు భరోసా, నమ్మకాన్ని కలిగించాలని, నిరుపేద ప్రజలకు పోలీసు అధికారులు అండగా నిలవాలని పదోన్నతి పొందిన ఎస్సైలకు సూచించారు.

శ్రమించారు.. సాధించారు

- గ్రూప్–2లో ఉద్యోగాలు సాధించిన జిల్లా వాసులు
- ఎక్సైజ్ ఎస్సైలుగా ఇద్దరు ఎంపిక



సంతోష్‌కుమార్



కాసర్ల సురేష్‌రెడ్డి

పట్టుదలతో చదివారు.. ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదివిన ఇద్దరు యువకులు గ్రూప్–2 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎక్సైజ్ ఎస్సైలుగా ఎంపికయ్యారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే గ్రూప్–2 కు ఎంపిక కావడంతో వీరిని పలువురు అభినందిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శికి గ్రూప్–2 ఉద్యోగం..
రాయపర్తి: మండలంలోని జయరాంతండా(ఎస్) గ్రామ పరిధిలోని సూక్యతండాకు చెందిన సంతోష్‌కుమార్ గ్రూప్–2 ఫలితాల్లో సత్తాచాటాడు. ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం సంతోష్‌కుమార్ పర్వతగిరి మండలం పెద్దతండాలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. తండావాసులు, స్నేహితులు సంతోష్‌కుమార్‌ను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. కష్టానికి ఫలితం దక్కిందని సంతోష్ హర్షం వ్యక్తం చేశాడు.

బాబాయ్ పిన్ని సంరక్షణలో పెరిగి..
నర్సంపేట/నల్లబెల్లి: నల్లబెల్లి మండలంలోని కన్నారావుపేట గ్రామానికి చెందిన కాసర్ల రమాదేవి, సుదర్శన్ రెడ్డి దంపతుల కుమారుడు కాసర్ల సురేష్‌రెడ్డి సురేష్‌రెడ్డి ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికయ్యాడు. సురేష్ రెడ్డి పదో తరగతి చదువుతున్న సమయంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో చిన్నమ్మ, బాబాయి నర్మద నర్సింహరెడ్డి వద్ద పెరిగాడు. అనంతరం 2014లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం చెన్నారావుపేట పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న సురేష్‌రెడ్డి ఆదివారం వెల్లడించిన గ్రూప్–2 ఫలితాల్లో ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికయ్యాడు. 2022 సంవత్సరం నుంచి చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్, అనంతరం చెన్నారావుపేట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. 2024డిసెంబర్ నెలలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన రాత పరీక్షలో గ్రూప్–2 పరీక్షను రాయగా ఆదివారం తుది ఫలితాలను విడుదలయ్యాయి. ఎంపీడీఓ నల్ల శ్రీవాణి, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, తోటి పంచాయతీ కార్యదర్శులు సురేష్‌రెడ్డిని అభినందించారు.

కోటగుళ్లలో పూజలు

గణపురం: మండలకేంద్రంలోని కోటగుళ్లలో ఆదివారం వైద్య ప్రొఫెసర్ల బృందం ప్రత్యేక పూజలు చేసింది. వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల, గాంధీ ఆస్పత్రికి చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ అనిత, మాలతి, అనురాధ స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు నాగరాజు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

భద్రకాళి అమ్మవారికి రథోత్సవం

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం అమ్మవారిని భవానీమాతగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో అర్చకులు నిత్యాహ్నికం నిర్వహించారు. ఉదయం అమ్మవారిని కాత్యాయనీ క్రమంలో దుర్గార్చన జరిపారు. సాయంత్రం చండముండహా క్రమంలో దుర్గార్చన జరిపి రథోత్సవం నిర్వహించారు. దేవాదాయధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ రామల సునీత, అర్చకులు భద్రకాళి శేషు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. మంత్రి సురేఖ అమ్మవారిని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు.

సారథి.. వాహనదారులకు వారధి

ఇంటి నుంచే డ్రైవింగ్ లైసెన్స్‌లు

- ఉమ్మడి జిల్లాలో అందుబాటులోకి పోర్టల్
- దేశవ్యాప్తంగా ఒకే పోర్టల్.. ఒకే లైసెన్స్ విధానం అమలు
- రోడ్డు భద్రతపై అవగాహన ఉంటేనే డ్రైవింగ్ లైసెన్స్
- త్వరలోనే ఆర్టీఏలో దళారుల వ్యవస్థ కనుమరుగు



వరంగల్ రవాణాశాఖ కార్యాలయం

ఖిలా వరంగల్ : రవాణా శాఖలో సంస్కరణల శకం మొదలైంది. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న వాహన్ వెబ్‌సైట్‌లోని డేటాబేస్‌తో రవాణాశాఖ అనుసంధానమైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖలో తీసుకొచ్చిన సారథి పోర్టల్ విధానాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చి సేవలందిస్తోంది. వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయాల్లో సారథి పోర్టల్ అమలుకు ఆగస్టు 18 తేదీన శ్రీకారం చుట్టారు. పోర్టల్‌లో తలెత్తుతున్న స్వల్ప సాంకేతిక ఇబ్బందులను దశల వారీగా సవరణ చేశారు. ప్రస్తుతం పోర్టల్‌లో నమోదు ప్రక్రియ విజయవంతమవుతోంది. ఇప్పటి వరకు సిటిజన్ ఫ్రెండ్లీ సర్వీస్ ఇన్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్(సీఎఫ్ఎస్టీ) పోర్టల్ పనిచేయగా ఇకపై దేశవ్యాప్తంగా కేంద్రం అమలు చేస్తున్న పరివాహన్ ద్వారా సేవలు అందనున్నాయి. ఆయా ఆర్టీఏ కార్యాలయాల్లో సేవలు పారదర్శకంగా అందుతున్నాయి.

విదేశాల నుంచైనా అవకాశం..

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన సారథి పోర్టల్ ద్వారా దేశ, విదేశాల నుంచైనా ఆన్‌లైన్‌లోనే ఇంటి నుంచి లైసెన్స్ తీసుకునే అవకాశం ఉంటుంది. రోడ్డు భద్రతపై పరిజ్ఞానం ఉంటే సులభంగా పరీక్ష ఉత్తీర్ణత కావొచ్చు. కాగా, సారథి పోర్టల్‌తో ఇంటి నుంచే లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందడం, రెన్యువల్, చిరునామా మార్పు వంటి అంశాలకు వీలు కల్పించనున్నారు. ప్రస్తుతం పోర్టల్ ద్వారా లైసెన్స్ తీసుకునే అవకాశం మాత్రమే కల్పించారు. అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకొని విదేశాలకు వెళ్లిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించక అక్కడి అధికారులు వాటిని తిరస్కరించిన ఘటనలు ఉన్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టొచ్చని ఎంవీఐలు భావిస్తున్నారు. కొత్త విధానంలో సాంకేతిక సమస్యల కారణంగా స్లాట్ బుకింగ్, వాహనదారులు ఆర్టీఏ కార్యాలయం వచ్చిన తర్వాత కొంత ఆలస్యం అవుతోంది. కొన్నాళ్లకు త్వరితగతిన సేవలు అందుతాయని అధికారులు అంటున్నారు. వాహనదారులు rarathiparivahan.gov.in / rarathirervicerలో స్లాట్ బుక్ చేసుకోవచ్చు.

ఇండియాలో ఒకే విధానం..

పరివాహన్ సారథి పోర్టల్ ద్వారా పొందిన లైసెన్స్ ఇండియాలో ఎక్కడైనా చెల్లుబాటు అవుతుంది. రెన్యువల్ టైంలో ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశం ఉంది. ఈకార్డు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చెల్లుబాటు అవుతుంది. ఇంతకాలం ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్ర పరిధిలోనే లైసెన్స్ ఉండేది. వివరాలు మరో రాష్ట్రంలో కనిపించేవి కాదు. అంతా గోప్యంగా ఉండేది. కానీ ప్రస్తుతం నూతనంగా వచ్చిన పరివాహన్ సారథి పోర్టల్ ద్వారా క్షణాల్లో వాహనదారుడి వివరాలు చేతికి వస్తాయి.

కనిపించని లైసెన్స్ కార్డు..



పరివాహన్ సారథి పోర్టల్‌లో లైసెన్స్ పొందిన వాహనదారుడికి కార్డు చేతికి రాదు. వాహనదారుడు డీఎల్ పరీక్ష రాయగానే ఆన్‌లైన్‌లోనే కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రత్యక్షంగా కార్డు ఇచ్చేది ఏమీ ఉండదు. ఫోన్‌కు వచ్చిన లింక్ ఓపెన్ చేస్తే కార్డు మీ మొబైల్‌లోనే డౌన్‌లోడ్ అవుతోంది. తనిఖీ సమయాల్లో ఆర్టీఏ, పోలీస్ అధికారులు పోర్టల్‌లో డౌన్ లోడ్ చేసుకున్న కార్డును చూపిస్తే సరిపోతోంది.

సారథి పోర్టల్‌తోనే సేవలు



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ జారీ సారథి పోర్టల్ ద్వారా అందిస్తున్నాం. ఆగస్టు 18న ప్రభుత్వం శ్రీకారం చుట్టగా ఈనెల మొదటి వారం నుంచి పూర్తి స్థాయిలో ఎల్ఎల్, డీఎల్‌లు అందజేస్తున్నాం. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు అధిగమించి సేవలు అందిస్తున్నాం.

జి. సురేశ్ రెడ్డి డీటీసీ, హనుమకొండ, వరంగల్

దళారుల వ్యవస్థ ఇక కనుమరుగు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాల్లో వాహనదారులు దళారులపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఇంతకాలం ఆర్టీఏలో డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు లర్నింగ్ లైసెన్స్ కావాలన్నా ఎంతో కొంత ముట్టచెప్పాల్సి వచ్చేది. సారథి పోర్టల్ అందుబాటులోకి రావడంతో నిదానంగా ఈ అవినీతి తగ్గుముఖం పడుతోంది. ఆర్టీఏ సేవలు ఇక సులభంగా పొందే అవకాశం ఉన్నా.. చదువుకున్న వ్యక్తికే డ్రైవింగ్ లైసెన్స్ జారీ అయ్యే అవకాశం ఉంది. దీని ద్వారా దేశంలో ఎక్కడి నుంచైనా వాహనదారులు రవాణా సేవలు పొందే వెసులు బాటు వచ్చింది. ఆన్‌లైన్‌లో పరిజ్ఞానం ఉంటే లర్నింగ్ లైసెన్స్ పరీక్ష సులభతరంగా ఉంటుందని రవాణాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం లైసెన్స్‌లకు ధ్రువీకరణ పత్రాల హార్డ్ కాపీ జత చేయాల్సి వస్తోంది. కొత్త విధానంలో సాఫ్ట్ కాపీతో సరిపోతుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఆగస్టు 18 నుంచి పరివాహన్ సారథి ద్వారా సేవలు అందిస్తున్నారు. రోజుకు 430 మందికి ఆన్‌లైన్‌లో వివిధ లైసెన్స్‌లకు స్లాట్స్ అందుబాటులో ఉన్నాయి.

విద్యా రంగంలో కొత్త అధ్యాయం

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు: సమ్మక్క, సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు లభిస్తాయని, విద్యారంగంలో ఈ యూనివర్సిటీ కొత్త అధ్యాయం సృష్టిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పరిధిలోని సాయిబాబా టెంపుల్ రోడ్ శివారులో సమ్మక్క, సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ విశ్వవిద్యాలయ ప్రహరీ నిర్మాణ పనులను మహబూబాబాద్, ఆదిలాబాద్ ఎంపీలు పోరిక బలరాం నాయక్, జి.నగేశ్, కలెక్టర్ దివాకర టి.ఎస్, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వైఎల్.శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుతో ములుగు జిల్లాకు ప్రత్యేక గౌరవం లభిస్తుందని, గిరిజన విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ఇది బలమైన వేదిక అవుతుందని తెలిపారు. ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉందని, యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక వసతులు సమకూర్చుతామని పేర్కొన్నారు. స్థానిక విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా రంగం, జిల్లా అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, మాజీ ఎంపీ సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి మూడేళ్ల 'లా' ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల 'లా కోర్సు ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు అక్టోబర్ 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ తెలిపారు. 8న మొదటి పేపర్, 10న రెండో పేపర్,14న మూడో పేపర్, 16న నాలుగో పేపర్, 18న ఐదో పేపర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.

స్కాన్ చేస్తే ఆలయ చరిత్ర

హన్మకొండ చౌరస్తా: చారిత్రక వేయిస్తంభాల ఆలయ చరిత్రను తెలుసుకునేందుకు ఇక గైడ్ అవసరం లేదు. ఆలయ చిత్రాలు, చరిత్రను క్షుణ్ణంగా వివరించేలా పురావస్తు శాఖ అధికారులు ఆలయ ప్రాంగణంలో క్యూఆర్ స్కానర్లను ఏర్పాటు చేశారు. గూగుల్ క్రోమ్ లోకి వెళ్లి స్కాన్ చేస్తే చాలు చరిత్ర తెలియజేస్తుంది.



ఆలయ ఆవరణలో పురావస్తు శాఖ ఏర్పాటు చేసిన క్యూఆర్ స్కానర్

పద్మశాలీలు ఉన్నత శిఖరాలకు చేరాలి

- అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందకట్ల స్వామి



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న శామంతుల శ్రీనివాస్

హన్మకొండ: పద్మశాలి కులస్తులు ఉన్నత శిఖరాలకు చేరాలని అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందకట్ల స్వామి అన్నారు. పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) ఆధ్వర్యంలో హనుమకొండలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతిభ కనబరిచిన పద్మశాలి విద్యార్థులకు ఆదివారం ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కందకట్ల స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పట్టుదలతో ముందుకు పోతే లక్ష్యాన్ని సాధిస్తారన్నారు. గ్రూప్స్, సివిల్స్‌లో పద్మశాలీలు ఇప్పుడిప్పుడే రాణిస్తున్నారన్నారు. రాజకీయాల్లోనూ రాణించాలని సూచించారు. పోపా రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివితే సాధించలేనిదంటూ ఉండదన్నారు. నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వాలని కోరారు. పోపా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే తమ సంఘం లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ అవార్డులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి రమేశ్, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి, పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు పద్మశాలి సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, పాము శ్రీనివాస్, గోషికొండ సుధాకర్, బైరి శ్యాంసుందర్, మాటేటి అశోక్, సంతోష్, ధర్మపురి రాజగోవింద్, దిడ్డి అనిల్, బత్తుల సత్యం, వంగరి వేణు, గుండేటి సతీశ్, కందకట్ల రాకేశ్, వడ్నాల సత్యనారాయణ, గుండు రవి, డాక్టర్ వన్నాల వెంకటరమణ, కుసుమ సతీశ్, వైద్యం రాజగోపాల్, డాక్టర్ కూరపాటి రాధిక, డాక్టర్ అంబటి అజయ్, మోతె రాజకుమార్, శ్రీరాముల శ్రీనివాస్, డాక్టర్ చింతకింది శ్రీనివాస్, విటోభా పాల్గొన్నారు.

బాలికలు, మహిళలకు జిల్లా స్థాయి చెస్‌పోటీలు



చెస్ ఆడుతున్న బాలికలు, మహిళలు

విద్యారణ్యపురి : ధర్మసాగర్ చెస్ నెట్‌వర్క్ క్లబ్, దండేపల్లి క్లబ్, ముప్పారం క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబురాల్లో భాగంగా హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో బాలికలు, మహిళలకు వరంగల్ జిల్లా స్థాయి చెస్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు గుంటి స్వప్న ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీలు బాలబాలికలు, మహిళల్లోని ప్రతిభ వెలుగులోకి రావడానికి దోహదపడుతాయన్నారు. అనంతరం న్యూరో సైకియాట్రిస్ట్ జగదీశ్‌బాబు మాట్లాడుతూ చదరంగం జీవన నైపుణ్యాలు నేర్పిస్తూ మానసిక శక్తిని వ్యూహాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తుందన్నారు. చీఫ్ ఆర్బిటర్ రజనీకాంత్, ఆర్బిటర్ శివ , ధర్మసాగర్ చెస్‌క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్ ఈపోటీలను సమన్వయం చేశారు. సెయింట్ పీటర్స్ విద్యా సంస్థల అధినేత నారాయణరెడ్డి, విశ్రాంత ఇంజనీర్ పొన్నాల రామయ్య, వరంగల్ నిట్ ఆచార్యులు ఆనంద కిశోర్, విశ్రాంత ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, విశ్రాంత ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి, చెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్రీహరిరామోజీ,హెచ్ఎం ధర్మ పాల్గొన్నారు.

బతుకమ్మ అంటేనే పూల పండుగ



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన మేయర్ సుధారాణి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



బతుకమ్మ ఆడుతున్న మంత్రి కొండా సురేఖ

- రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఖుష్‌మహల్ మైదానంలో అంబరాన్నంటిన సంబురాలు

ఖిలా వరంగల్: బతుకమ్మ అంటేనే పూల పండుగ అని, బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పాల్సిన అవసరం మనందరిపై ఉందని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని చారిత్రక మధ్యకోట ఖుషిమహల్ మైదానంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచేలా రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మ కేవలం పూల పండుగ కాదని, ఇది ఆడబిడ్డల ఆశయాల పండుగ, ప్రకృతిని పూజించే పండుగ, భూదేవికి సమర్పించే నైవేద్యమని చెప్పారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. నగర ప్రజల కోసం 29,30 తేదీల్లో సద్దుల బతుకమ్మ ఆట స్థలాల్లో ఏర్పాట్లు చేశామని, 16 ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణ, ముస్కమల్ల అరుణ, పోశాల పద్మ, పల్లం పద్మ, డీఆర్‌ఓ విజయలక్ష్మి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కటాక్షపూర్ చెరువు మత్తడి

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడి పెరిగింది. జాతీయ రహదారి-163పై ఉన్న మత్తడి ప్రవాహం పెరగడంతో వాహనదారులు ఇబ్బంది పడకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. లారీలు వెళ్లకుండా గూడెప్పాడ్ నుంచి మళ్లించారు. కార్లను శాయంపేట మీదుగా మళ్లించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.



మత్తడి పోస్తున్న కటాక్షపూర్ చెరువు

పెరుగుతూ.. తగ్గుతూ..



వాజేడు- గుమ్మడి దొడ్డి గ్రామాల మధ్య రహదారిపై వరద

- గోదావరి వరద ఉధృతి



ముంపునకు గురైన జాతీయ రహదారి

వాజేడు: గోదావరి దోబూచులాడుతోంది. శనివారం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు ఉధృతంగా పెరిగిన గోదావరి వరద 2 గంటల పాటు నెమ్మదించింది. సాయంత్రం 4 నుంచి మళ్లీ పెరుగుతూ రహదారులను ముంచెత్తింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి ఆదివారం సాయంత్రం 6 గంటలకు 15.890 మీటర్ల మేర పెరిగింది. టేకులగూడెం గ్రామ చివరిలోని జాతీయ రహదారి మళ్లీ ముంపునకు గురి కావడంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పల్లపు ప్రాంతాల నుంచి గోదావరి ప్రవహిస్తుండటంతో మిర్చి పంటలు ఇంకా నీటిలో మునిగి ఉన్నాయి.

సమ్మక్కసాగర్‌లోకి భారీగా వరద నీరు

కన్నాయిగూడెం: నాలుగు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఎగువన ఉన్న బ్యారేజీల నుంచి గోదావరిలోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది. దీంతో మండల పరిధిలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్కసాగర్ బ్యారేజీలోకి ఆదివారం భారీగా వరద నీరు వచ్చి చేరడంతో బ్యారేజీ వద్ద గోదావరి ఉగ్ర రూపంతో ప్రవహిస్తోంది. ఈ మేరకు బ్యారేజీలోకి ఆదివారం 7,78,600 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజీకి ఉన్న 59గేట్లను ఎత్తి అదే మోతాదులో నీటిని దిగువకు వదులుతున్నారు.

వేడివేడి.. టేస్టీ టేస్టీగా



వానాకాలం, చలి కాలాల్లో ఎక్కువగా మొక్కజొన్న కంకులకు గ్రేటర్ వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని మండల కేంద్రాలు, రహదారుల పక్కన విక్రయిస్తు ఉంటారు. రోడ్లకు ఇరువైపులా కాల్చిన, ఉడకబెట్టిన మొక్కజొన్న కంకులను ప్రయాణికులు కొనుగోలు చేసి తింటుంటారు. అడ్డా కూలీలు, కొందరు రైతులు మొక్కజొన్న పొత్తులను నగరానికి తీసుకొచ్చి విక్రయించి ఉపాధి పొందుతున్నారు.

- కాల్చిన, ఉడకబెట్టిన మొక్కజొన్న కంకులకు భలే డిమాండ్



కాజీపేట రైల్వే స్టేషన్ పరిధిలో కంకులు కాల్చుతున్న మహిళ

కాజీపేట : ట్రై సిటీలోని అనేక ప్రాంతాల్లో ఉడకబెట్టిన, కాల్చిన కంకులు తినడానికి ప్రజలు మక్కువ చూపుతున్నారు. ప్రధాన రహదారులు, రైల్వే స్టేషన్లు, బస్టాండులలో తోపుడుబండ్లపై కాల్చిన, ఉడకబెట్టిన మొక్క జొన్న కంకులను విక్రయిస్తూ చిరు వ్యాపారులు, కొందరు రైతులు, మరికొందరు అడ్డా కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఈ సీజన్‌లో మక్క కంకుల విక్రయం జోరుగా సాగుతోంది.

కంకులకు భలే డిమాండ్..

నగరంలో దాదాపు 50కి పైగా ప్రాంతాల్లో చిన్న బొగ్గుల పొయ్యి ఏర్పాటు చేసుకొని కాల్చిన మొక్కజొన్న కంకులు విక్రయిస్తున్నారు. ప్రతీ ఏటా వేడి వేడి మొక్కజొన్న కంకులకు ఆదరణ పెరగడంతో కాల్చి విక్రయించే కేంద్రాలు పెరిగిపోతున్నాయి. దీంతో నగరంలోని అనేక ప్రాంతాల్లో మొక్కజొన్న కంకుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే, ఉడకబెట్టి కంకులను విక్రయిస్తున్నారు. రూ.15నుంచి రూ.20లకు ఒక కంకి చొప్పున అమ్ముతున్నారు.

మొక్కజొన్న కంకులు ఇష్టం



వానాకాలం, చలికాలాల్లో కాల్చిన కంకులు తినడం అంటే ఎంతో ఇష్టం. రహదారిపై ఆగి మరి కొని తింటా. పచ్చి కంకుల ధరకన్నా కాల్చినా, ఉడక బెట్టిన కంకులకు నాలుగు పైసలు ఎక్కువే. అయినా అమ్మకందారుల శ్రమను గుర్తించాలి.

- కుమ్మరి రాజ్‌కుమార్, సోమిడి

బస్తీబస్తీ తిరుగుతూ...

రెండేళ్ల నుంచి తోపుడు బండ్లపై మొక్కజొన్న కంకుల విక్రయాలు పెరుగుతున్నాయి. సాధారణంగా పొట్టు తీసి కాల్చడం కంటే పొట్టుతో సహా కాలిస్తే గింజలు మరింత రుచిగా ఉంటాయని రైతులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది జూలై నుంచే మక్క కంకులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి.

కొన్ని ప్రాంతాల్లో రైతులే నేరుగా..

కొన్ని ప్రాంతాల్లో రైతులే నేరుగా మొక్కజొన్న కంకులను విక్రయిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టూ పక్కల ప్రాంతాల రైతులు పండించిన మొక్కజొన్న కంకులను వ్యవసాయ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వివిధ జిల్లాలకు చెందిన రైతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వరంగల్ నగరంలోని ప్రత్యేక అడ్డాల్లో కంకులను హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. ఇలా విక్రయించడం వల్ల కొంత లాభం వస్తున్నప్పటికీ ట్రాఫిక్ పోలీసుల నుంచి ఇబ్బందులు తప్పడంలేదని వారు ఆవేదన చెందుతున్నారు.